క్లుప్తంగా

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మధురవాడ క్రీడాకారులతో కోచ్‌లు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. గత నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో యూనివర్శిటీ ఆఫ్ కోటా వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 8 పతకాలురాగా అందులో ముగ్గురు మధురవాడ క్రీడాకారులు కావడం విశేషం. క్యాడెట్ బాలికల విభాగంలో కె.ధనలక్ష్మి స్వర్ణం, సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విశాల్, మహేశ్వరరావు కాంస్య పతకాలు సాధించినట్టు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి అచ్యుత రెడ్డి తెలిపారు. మధురవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను కోచ్ ఎమ్.సురేష్, ఏపీ కోచ్‌గా వ్యవహరించిన కె.సుకుమార్ సంపత్, కొర్రాయి సురేష్ తదితరులు అభినందించారు.

ట్యాబ్‌లతో పెరిగిన అభ్యసన సామర్థ్యం



ట్యాబ్‌లను చూపుతున్న విద్యార్థులు

భీమునిపట్నం: ప్రభుత్వం డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల ద్వారా అందరికీ అభ్యసన సామర్థ్యం పెరిగిందని రాష్ట్ర విద్య, పరిశోధన సంస్థ ఐటీ సెల్ స్టాటిస్టిక్స్ అధ్యాపకులు సీహెచ్.రమేష్ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలిసి ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు ఎంతో నాణ్యమైన విద్యను అందివ్వాలన్న ఉద్దేశంతో ట్యాబ్‌లు అందజేశారన్నారు. భవిష్యత్‌లో ఇతర తరగతుల వారికి కూడా ట్యాబ్‌లు అందివ్వడానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం చేస్తోందని, ఇది ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీ సెల్ కో ఆర్డినేటర్ శేషసాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


అయ్యప్ప సేవా పీఠంలో పూజలు



పీఠం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

తగరపువలస: లక్ష్మీపురంలోని అయ్యప్ప సేవా పీఠంలో బుధవారం సామి జన్మ నక్షత్ర పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి లక్ష్మీ గణపతి పూజ, పుణ్యాహవచనం, సర్వదేవత మండపారాధన, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మహానారాయణ సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గురుస్వామి డాక్టర్ గాడు తాతినాయుడు, కనకల అప్పలరాజు, కరుభుక్త రమణ, నీలాపు సూర్యనారాయణ, గుడ్డాల కృష్ణ, సరగడ కృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా విజయ్‌కుమార్



పద్మనాభం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) ఎం.విజయ్ కుమార్ నియమితులయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) జిల్లా కో - ఆర్డినేటర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ ఆసరా

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పద్మనాభం: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బి.ఆర్.తాళ్లవలసలో బుధవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాటిచ్చారంటే భూకంపాలు, తుఫాన్ వంటి ప్రళయాలు వచ్చినా వెనక్కి తగ్గకుండా నేరవేర్చుతారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినప్పటికీ సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగిస్తున్నారని కొనియాడారు. చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. పద్మనాభం మండలంలోని 22 పంచాయతీల్లో మూడు వేల మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు విలువ చేసే ఇళ్ల స్థలాలు ఇచ్చారని తెలిపారు. మూడో విడత ఆసరా కింద పద్మనాభం మండలంలో 12,575 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.10.99 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ వారికే లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ పాలనలో వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష కట్టి కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా మహిళలకు మూడో విడత ఆసరాలో భాగంగా రూ.10.99 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే శ్రీనివాసరావు అందజేశారు. ముందుగా జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడి, ఆసరా వంటి పథకాలతో లబ్ధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

మండల విద్యాశాఖ కార్యాలయం ప్రారంభం

మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ఆధునీకరించిన మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, బి.ఆర్.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధ, తహసీల్దార్ టి.శ్రీవల్లి, ఎంఈవో ఎం.శివరాణి, ఏపీఎం ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు మామిడి శివ రామకృష్ణ, సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఈ వేసవిలో గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల ఏడు నుంచి 20 వరకు ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమం నిర్వహించాలన్నారు. పద్మనాభం రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు పనితీరు మెరుగు పరచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పనితీరును వివరించాలి

భీమునిపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి చక్కగా వివరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గృహసారథులు, కన్వీనర్లు, నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి జగనన్నే మా భవిష్యత్..., మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ సచివాలయాల పరిధిలో ఇళ్లకు వెళ్లి పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును తెలుసుకోవాలని సూచించారు. బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని కోరారు.

'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ప్రారంభం నేడు

ఆనందపురం : మండలంలోని వేములవలస సచివాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, కలెక్టర్ మల్లికార్జున పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఇంత వరకూ ట్రయల్ రన్‌గా నిర్వహించిన కార్యక్రమం విజయవంతం కావడంతో పూర్తి స్థాయిలో అమలు జరపడానికి నిర్ణయించారు.

'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ల ఆవిష్కరణ



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: రేఖవానిపాలెం పంచాయతీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం ''మా నమ్మకం నువ్వే జగన్'' కార్యక్రమ స్టిక్కర్లు ఆవిష్కరించారు. కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం ఏర్పాటు చేసి కార్యక్రమం ఉద్దేశ్యం వివరించారు. జిల్లా వ్యవసాయ మండల చైర్మన్ దాట్ల పెదబాబు, కన్వీనర్ రఘునాథరెడ్డి, వైస్ ఎంపీపీ బంగారు నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



పైడితల్లి అమ్మవారి గుడివద్ద నాయకులతో బొడ్డు అప్పలకొండమ్మ దంపతులు

తగరపువలస : ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొడ్డు అప్పలకొండమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు అన్నారు. భీమిలి మండలం శింగనబందలో గల పైడితల్లమ్మ దేవాలయాన్ని బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, గ్రామస్తులు అప్పలకొండమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. డొకర శ్రీను, రమణ, రాము, రాజు, తాలాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం రూ.10 వేల సాయం



నగదు అందిస్తున్న యవజన సేవా సంఘ సభ్యులు

తగరపువలస: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన మహిళకు తాటితూరుకు చెందిన శాలివాహన (కుమ్మరి) యువజన సేవా సంఘం పెద్దలు బుధవారం రూ.10 వేలు సాయం అందించారు. ఇటీవల లక్కవరపుకోట మండలం పిల్ల అగ్రహారం గ్రామానికి చెందిన పాట్నూరు గాయత్రి అనే మహిళ కాలు కోల్పోయింది. ఆమె కుటుంబానికి ఈ మేరకు ఆర్థిక సాయా న్ని అందించారు. పాట్నూరు ఎర్రిబాబు, ఊశెట్టి అప్పలరాము, తాటిపూడి కొండలరావు, తాటిపూడి త్రినా థ్, తాటిపూడి పైడిరాజు, వీ. కాళిదాసు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు బాలుకు సన్మానం



బాల సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న నాయకులు

పద్మనాభం: రంగస్థల నటుడిగా సామవేదం బాల సుబ్రహ్మణ్యం (బాలు) పలు పాత్రలు పోషించి పేరు ప్రఖ్యాతులు గడించారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో ఎంపీపీ రాంబాబు, కేఆర్బీ యూత్ ఆధ్వర్యంలో బాలు దంపతులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ బాల సుబ్రహ్మణ్యం 32 అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. ఇటీవల గౌరవ డాక్టరేట్, శ్రీకృష్ణదేవరాయులు అవార్డు బాల సుబ్రహ్మణ్యం అందుకున్నారన్నారు. బాందేవుపురం కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, బుగత ఎర్నాయుడు, బుగత సత్యనారాయణ, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అబాకస్ పోటీలు

మధురవాడ: విద్యార్థుల్లోని అంతర్గత శక్తులను వెలికితీసి మరింత పదును పెట్టడానికే వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్టు శ్రీచైతన్య విద్యా సంస్థల ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జి ఎమ్. పద్మ, ఉత్తరాంధ్ర జిల్లాల ఏజీఎమ్ ఎమ్‌వీ సురేష్ అన్నారు. కొమ్మాదిలోని శ్రీచైతన్య స్కూల్లో బుధవారం రీజినల్ అబాకస్, స్టోరీ నారథాన్ ముగింపు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలంటే మ్యాథ్స్‌పై పట్టు సాధించడం చాలా ముఖ్యమన్నారు. అబ్దుల్ కలాం, ఛత్రపతి శివాజీ వంటి వారు అమ్మనే గురువుగా ప్రేరణ పొంది ఉన్నత స్థితికి చేరుకున్నారని..., అటువంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వై.ఆశిబాబు, ఎమ్.రమణ, అహ్మద్ ఆలీ పాల్గొన్నారు.

పోరాటాలకు స్ఫూర్తి సుబ్బారావు



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ: పోరాటాలకు కామ్రేడ్ సుబ్బారావు స్ఫూర్తి అని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు అన్నారు. మధురవాడలోని ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద సుబ్బారావు చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, ప్రజా ఉద్యమాలకు సుబ్బారావు నాయకత్వం వహించారన్నారు. అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బి.సూరమ్మ, ఎస్.ఆదిలక్ష్మి, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎస్.చిన్న, కె.సన్ని, ఎం.రాజు, పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

మధురవాడ: నివాస ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకోవడం కోసం ఈ నెల 14 నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. మధురవాడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంబేడ్కర్ జయంతి రోజు నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు చెప్పారు. మధురవాడ జాతీయ రహదారి నుంచి నగరంపాలెం వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఏడేళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ పూర్తి చేయలేదన్నారు. స్వతంత్రనగర్, అయోధ్యనగర్, ద్రోణంరాజు కల్యాణ మండపం, పాత మధురవాడ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన వాటర్ ట్యాంకులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఎండీ బేగం, జి.వేళంగినిరావు, ఎంఎస్ పాత్రుడు, పీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందుకోసం గడప గడపకు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు పెద రుషికొండ, స్వర్ణభారతినగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. అందుకే ఎక్కడకు వెళ్లినా స్థానిక ప్రజలు నీరాజనం పడుతున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే చదువుకు, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నామని, అదేవిధంగా సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా సమానంగా సాగుతుందన్నారు. ఇప్పుడు ఎన్నికలు లేకపోయినా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసమే ''గడప గడపకు మన ప్రభుత్వం'' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించుకున్నారు. వీధిలైట్లు వెలగడం లేదని, పలు చోట్ల డ్రైనేజీలు ధ్వంసం అయ్యాయని, అక్కడక్కడ మంచినీటి సమస్యలున్నాయని తెలపగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, చెన్నాదాసు, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, బుజ్జి, చెన్నా ఎల్లయ్య, రమణమూర్తి, రామ్మోహన్, రాజేశ్వరి, అప్పలరాజు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: సంఘసంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని పోగొట్టడానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అనేక పోరాటాలు చేయడంతోపాటు పలు పదవులను చేపట్టి ప్రజలకు విలువైన సేవలు అందించారన్నారు. అటువంటి గొప్ప నాయకుడిని అందరూ గుర్తించుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, నాయకులు అక్కరమాని రామునాయుడు, భాగం గోపాలరావు, అనపర్తి సూర్యప్రకాశరావు, ఎర్నించి అచ్చిబాబు, చెల్లూరి గౌరినాయుడు, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, గుండాసి మధునాయుడు, కోండ్రు రామసూరప్పడు, కొంకిపూడి ఎర్రిబాబు, కందివలస నరేంద్రకుమార్, పాసిమధు, ప్రగడ చంటి పాల్గొన్నారు.

● జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, దేశ అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు మరువలేనివన్నారు. అధ్యాపకులు గొట్టేటి రవి, నాగేశ్వరరావు, ఎం.మహాలక్ష్మి, షేక్ అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

ఆనందపురం : అట్టడుగున ఉన్న వారి అభ్యున్నతి కోసం బాబూ జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు అన్నారు. వెల్లంకి, వేములవలస గ్రామాల్లో జగ్జీవన్ రామ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసి ఉన్నత పదవిని అలంకరించి, పేదల కోసమే పని చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవీపీ ప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు, రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

తగరపువలస: జీవీఎంసీ 1వ వార్డు బంగ్లామెట్టలో గల ప్రాథమిక పాఠశాలలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు నివాళులర్పించారు. భీమిలి పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

● సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో బాబూ జగ్జీవన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలు మరువరానివని కళాశాల ప్రిన్సిపల్ కె.రామకృష్ణ కొనియాడారు.

పద్మనాభం: మండలంలోని పెంట గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర నాయకుడు దేవరపల్లి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కింతాడ దేముడు, దేవరపల్లి రమణమ్మ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమల్లో కండీషన్ మానిటరింగ్



ప్రబల్ ఘోష్‌ను సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

కొమ్మాది: ఉక్కు పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించడం, యంత్రాల పనితీరును సమీక్షించడం ద్వారా ఉత్పాదనకు అంతరాయం కలగకుండా చూడటంలో కండీషన్ మానిటరింగ్ కీలక పాత్ర పోషిస్తోందని టాటా స్టీల్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు ప్రబల్ ఘోష్ అన్నారు. కండీషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా గీతం వర్సిటీలో బుధవారం నిర్వహించిన వి.భుజంగరావు ధార్మికోపన్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యంత్రాల దీర్ఘకాలిక పనితీరును మెరుగుపరచడానికి కండీషన్ మానిటరింగ్ అవసరమన్నారు. కార్యక్రమంలో డీన్స్ ప్రొఫెసర్ విజయశేఖర్, ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ శివారులో కాలిబాటలే రహదారులు



చిట్టివలస రెల్లిపేట ప్రజలు వినియోగించే కాలిబాటలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు శివారు విజయనగరం జిల్లా సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు రహదారి సౌకర్యం లేక ఇప్పటికీ కాలిబాటలనే వినియోగిస్తున్నారు. బొగ్గురోడ్డు నుంచి శారదా స్కూల్ వెనుక కొన్ని నివాసాలకు చాలా వరకు రహదారి సౌకర్యం లేదు. ఇక రెల్లిపేట, చిట్టివలస కళ్లాలకు వెళ్లాల్సిన వారైతే వ్యవసాయ భూముల నుంచి కాలిబాటల్లో వెళ్లలేక విజయనగరం జిల్లాలోని కొత్త మూలకుద్దు - శ్రీరామ్‌నగర్ మార్గంలో వెనుక నుంచి ఉన్న తోటల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక చీకటి పడితే వ్యవసాయ భూములు, రెల్లిపేట, కళ్లాలకు చెందిన ప్రజలు తోడులేకుండా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. శివారు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలిగించాలని కోరుతున్నారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు



రుషికొండ బీచ్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న నగరవాసులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఆంధ్ర యూనివర్సిటీకి మంజూరైన యూరోపియన్ కమిషన్‌ల ప్రాయోజిత ప్రాజెక్టులో భాగంగా బీచ్ క్లీన్ అప్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎన్‌జీవో, స్కూబా డైవింగ్ బృందం, ఇతర సభ్యులు కలిసి సుమారు 800 కిలోల ప్లాస్టిక్, 200 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.జానకిరామ్, డాక్టర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.